సాక్షి
అనంతపురం
మంగళవారం । 16 । మే । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



'అనంత'లో దారుణం

అనంతపురం దారుణం జరిగింది. ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యుల నిర్లక్ష్యంతో ఇద్దరు గర్భిణులు ప్రాణాలు కోల్పోయారు. 8లో

గరిష్టం/కనిష్టం
41.4°/25.2°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో వేసవి తాపం, ఉక్కపోత అధికంగా ఉంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

దారి కాచిన మృత్యువు

- వైఎస్సార్ జిల్లా ఏటూరు వద్ద రోడ్డు ప్రమాదం
- సంఘటన స్థలంలోనే ఏడుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు తాడిపత్రి వాసులు
- మిగిలిన వారంతా బంధువులే..

కాసేపట్లో గమ్యం చేరుకోవాల్సిన వారిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. అక్కాచెల్లెళ్లు తమ కుటుంబాలతో తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. వీరిలో నలుగురు అక్కచెల్లెళ్లు, వారి ఇద్దరు కుమారులతో పాటు డ్రైవర్ ఉన్నారు. మృతుల్లో ఇద్దరు తాడిపత్రికి చెందిన తల్లీ కుమారుడు ఉన్నారు. ఎక్కడికెళ్లినా కలిసి వెళ్లే అక్కాచెల్లెళ్లు ఆఖరుకు మృత్యువులోనూ కలిసే వెళ్లిపోవడం అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి.



మృతులు తల్లీ కుమారుడు వెంకటలక్ష్మి, సునీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

తాడిపత్రి అర్బన్: వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం నేదరపేటకు చెందిన వి.చెన్నారెడ్డి, లక్షుమమ్మ దంపతులకు ఆరుగురు కూతుళ్లు సంతానం. వీరిలో ఒకరు చనిపోయారు. మిగిలిన ఐదుగురిలో వెంకటలక్ష్మమ్మ పెద్దది. ఈమె భర్త కంచం ప్రసాద్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు. కంచం వెంకటలక్ష్మమ్మ (55) చిన్నకుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (27)తో కలిసి తాడిపత్రి కృష్ణాపురం నాలుగో రోడ్డులో అద్దె ఇంటిలో నివాసముంటోంది. ఈమె పెద్ద కుమారుడు సురేంద్రకుమార్‌రెడ్డి బళ్లారిలో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తూ అక్కడే నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు తాడిపత్రి వచ్చి వెళ్తుంటాడు. చీరల వ్యాపారంతో పాటు టైలరింగ్ పని చేసే వెంకటలక్ష్మకు చిన్న కుమారుడు వలంటీర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుండేవాడు.

అన్యోన్యతకు మారుపేరు ఆ అక్కాచెల్లెళ్లు..

వెంకటలక్ష్మమ్మ, ఆమె చెల్లెళ్లు ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా అందరూ కచ్చితంగా కలిసివెళ్లేవారు. ఐకమత్యానికి ప్రతిరూపాలుగా ఉన్న వెంకటలక్ష్మమ్మ, ఆమె ముగ్గురు చెల్లెళ్లు బళ్లారికి చెందిన సిరయ్యగారి లక్ష్మీదేవి అలియాస్ బుజ్జి (39), కాటసాని సుభద్ర (35), వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన కాటసాని సుమలత(38) తిరుమల శ్రీవారి దర్శనం వెళదామని నిర్ణయించుకున్నారు. శనివారం అద్దె తూఫాన్ వాహనంలో అక్కచెల్లెళ్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. స్వామికి మొక్కులు చెల్లించుకుని.. ఆనందంగా తిరుగుపయనమయ్యారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద వీరి వాహనాన్ని ఎదురుగా వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మమ్మ, ఆమె కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, చెల్లెళ్లు లక్ష్మీదేవి, సుమలత, సుభద్ర,తో పాటు సుభద్ర కుమారుడు నితిన్ రెడ్డి(11), వైఎస్సార్ జిల్లా లింగాల మండలానికి చెందిన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి (31) దుర్మరణం చెందారు. అర గంటలో తాడిపత్రికి చేరుకోవాల్సిన వారంతా విగతజీవులై రావడం బంధువుల్లో తీవ్ర విషాదం నింపింది.ఈ ప్రమాదంలో మరో ఐదుగురు గాయపడ్డారు. తల్లి, తమ్ముడి మృతదేహాలను చూసి సురేంద్రకుమార్‌రెడ్డి గుండెలవిసేలా రోదించారు. నన్ను అనాథను చేసి వెళ్లిపోతిరా.. దేవుడా ఎంత పని చేశావయ్యా.. అంటూ విలపించాడు.

వైఎస్సార్ జిల్లా ఏటూరు సమీపంలో లారీ ఢీకొని నుజ్జునుజ్జయిన తూఫాన్ వాహనం

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందటంపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు కావడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



అనంతపురం క్రైం: వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ గౌతమి సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మధుసూదన్, డీఐఓ డాక్టర్ యుగంధర్ ఉన్నారు.

ఆస్పత్రిలో ఆర్తనాదాలు

యాడికి: తిరుమల నుంచి తాడిపత్రికి వస్తున్న తూఫాన్ వాహనం వైఎస్సార్ జిల్లా ఏటూరు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మమ్మ చెల్లెలు జయలక్ష్మి, ఆమె భర్త బి.నరసింహారెడ్డి, కుమార్తె ఆదిలక్ష్మి, బళ్లారికి చెందిన కాటసాని భాస్కర్‌రెడ్డి, బళ్లారికి చెందిన లక్ష్మీదేవి కుమార్తెలు మేఘనారెడ్డి, శిల్పారెడ్డితో పాటు ఇద్దరు చిన్నారులు యువన్‌రెడ్డి, మోక్షిత్‌రెడ్డి గాయపడ్డారు. వీరిని సమీపంలోని తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యుల ఆర్తానాదాలతో ఆస్పత్రి పరిసరాలు దద్దరిల్లాయి. మృతదేహాలు గుర్తించలేనంతగా ఉండటంతో బంధువులు, కటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. తాడిపత్రిలో క్రిష్ణాపురం నాలుగో రోడ్డులో ఉన్న వెంకటలక్ష్మమ్మ(55), కుమారుడు, వలంటీర్ అయిన సునీల్ కుమార్‌రెడ్డి(29)ల మృతదేహాలను చూసేందుకు కాలనీవాసులతో పాటు సచివాలయ సిబ్బంది తరలివచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.



ఆస్పత్రిలోని పోస్టుమార్టం గది వద్ద గుమికూడిన వెంకటలక్ష్మమ్మ బంధువులు

న్యూస్‌రీల్

చిరుధాన్యాల వినియోగం పెరగాలి



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మిల్లెట్ మార్ట్

అనంతపురం అర్బన్: పోషక విలువలు అధికంగా ఉండే చిరుధాన్యాల వినియోగం పెరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ గౌతమి అన్నారు. 2023ను మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల వాడకం పెరిగేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మిల్లెట్ మార్ట్‌ను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. చిరుధాన్యాలతో చేసిన బిస్కెట్లు, మాల్ట్ పౌడర్, మల్టీగ్రెయిన్ మాల్ట్, జోవర్ మీల్, సజ్జ, జొన్న, రాగి రొట్టెలు తదితర వస్తువులను పరిశీంచాలరు. కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకం వల్ల ఆరోగ్య సమస్యలను దూరం చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యలతో చేసి ఏదో ఒక పదార్థాన్ని తమ రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, అధికారులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు



పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ బస్తాలు

అనంతపురం అగ్రికల్చర్: విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా మంగళవారం నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో 40 శాతం రాయితీ పోను తక్కిన మొత్తాన్ని చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 3 బస్తాలు (90 కిలోలు) నాణ్యమైన విత్తనాలు అందిస్తామన్నారు.

ఆర్బీకేలకు 2,500 క్వింటాళ్ల వేరుశనగ

ప్రాసెసింగ్ ప్లాంట్లలో శుద్ధి చేసిన విత్తన వేరుశనగను రైతు భరోసా కేంద్రాలకు(ఆర్బీకే) సరఫరా చేసే ప్రక్రియ వేగవంతం చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే.ధనలక్ష్మి సోమవారం 'సాక్షి'కి తెలిపారు. అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు, గార్లదిన్నె, కూడేరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, నార్పల, వజ్రకరూరు మండలాల్లోని 39 ఆర్బీకేలకు ఇప్పటికే 2,500 క్వింటాళ్ల విత్తనం చేర్చామన్నారు. ప్రస్తుతానికి ప్రతి ఆర్బీకేకు 50 నుంచి 100 క్వింటాళ్లు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాకు 78,245 క్వింటాళ్ల విత్తనం కేటాయించిదన్నారు. 40 శాతం రాయితీతో ఈనెలాఖరు నాటికి పంపిణీకి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కట్టుదిట్టంగా ఏపీఈఏపీసెట్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ జింకా రంగజనార్దన

అనంతపురం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్–2023 సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు ఇంజినీరింగ్ స్ట్రీమ్‌కు సంబంధించిన పరీక్ష మూడు సెషన్లలో కట్టుదిట్టంగా నిర్వహించారు. అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు ఉదయం సెషన్‌లో 1,190 మంది, మధ్యాహ్నం జరిగిన రెండు సెషన్లలో వరుసగా 1,203, 2,393 మంది మొత్తం 4,686 మంది హాజరయ్యారు.

- శ్రీసత్యసాయి జిల్లాలో ఉదయం సెషన్‌లో 101 మంది, మధ్యాహ్నం సెషన్‌లో వరుసగా 97 మంది, 198 మంది మొత్తం 396 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇదిలా ఉండగా, అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన పరిశీలించారు.

రాష్ట్ర సలహా మండలిలో సభ్యునిగా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర సలహా మండలిలో బధిరుల కోటా కింద జిల్లాకు చెందిన ఎ.లక్ష్మీనారాయణను సభ్యునిగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఫయాజ్‌కు మరోసారి అవకాశం

- మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియామకం
- గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా మరోసారి ఏకేఎస్ ఫయాజ్ నియమితులయ్యారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కొనసాగనున్నారు. ఈ మేరకు 20 మంది పాలకవర్గంతో కూడిన కమిటీని ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక డైరెక్టర్, ఒక ట్రేడర్ మినహా అందరూ పాతకమిటీలో ఉన్నవారే మరోసారి నియమితులయ్యారు. 2024 మే 8వ తేదీ వరకు అంటే ఏడాది పాటు ఈ కమిటీ కొనసాగనుంది.

కొత్త పాలకవర్గం ఇదే:

గౌరవాధ్యక్షులు : అనంత వెంకటరామిరెడ్డి
కమిటీ చైర్‌పర్సన్ : ఏకేఎస్ ఫయాజ్
వైస్ చైర్మన్ : కే.ఓబిరెడ్డి
కమిటీ సభ్యులు: ఎం.రాజీ, బండారు శోభారాణి, బి.సాధుశేఖర్, పి.రవికుమార్, ఆర్.నాగరాజు నాయక్, కే.విద్యాధరి, ఉప్పర సుమంజలి, కె.పద్మావతి, పి.నీరజ, దాసరి గోవిందు, ఎల్ఎస్ రమేష్‌బాబు, జే.మంజునాథ్, గోపా లలిత, రుద్రంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షులు, మార్కెటింగ్‌శాఖ ఏడీ, వ్యవసాయశాఖ అనంతపురం ఏడీఏ, నగరపాలక సంస్థ మేయర్ సభ్యులుగా ఉంటారు.

ఫ్యాక్షన్‌కు పురుడు పోసింది జేసీ సోదరులే



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌కు పురుడు పోసింది జేసీ సోదరులేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లిలో నాలుగో విడత ప్రజా సంక్షేమ పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి మాట్లాడుతూ జేసీ సోదరులు (దివాకర్‌రెడ్డి–ప్రభాకర్‌రెడ్డి) మూడు దశాబ్దాలుగా తాడిపత్రిలో దౌర్జన్య పాలన సాగించారని, పచ్చని పల్లెల్లో కక్షలు, కార్పణ్యాలకు తెరలేపారని మండిపడ్డారు. వారి రాజకీయ జీవితమంతా ప్రత్యర్థులపై కక్ష సాధించడానికే సమయం సరిపోయిందన్నారు. తమకు ఓటు వేయని వారిపైకి పోలీసులను ఉసిగొల్పి మానసిక వేదనకు గురిచేసేవారని ధ్వజమెత్తారు. ఎవరైనా పల్లెల్లో సమస్యలపై న్యాయం కోసం వస్తే ఇరు వర్గాలకు నచ్చజెప్పాల్సింది పోయి.. పరోక్షంగా ఒక వర్గం వారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసేవారని ఆరోపించారు. జేసీ సోదరులు తమ మూడు దశాబ్దాల పాలనలో అభివృద్ధి ముసుగులో తాడిపత్రి ప్రాంతంలో ఉన్న సహజ సంపదను దోపిడీ చేశారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆరోపించారు. ఇది చాలక ఇతర రాష్ట్రాల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. నాగాలాండ్‌లో వాహనాలకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి విక్రయించిన జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓ పెద్ద దొంగ అని విమర్శించారు. తాను ప్రతిపక్ష పార్టీపై ఎప్పుడూ కక్షసాధింపులకు దిగలేదని పెద్దారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రత్యర్థులుగా చూస్తానని, తర్వాత అన్ని పార్టీల వారినీ సమానంగా చూస్తానని చెప్పారు. తాడిపత్రిలో ఫ్యాక్షన్ రాజకీయాలను రూపుమాపి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకే తాను పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. జేసీ సోదరుల పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు కురవ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ యాడికి మండల కన్వీనర్ బొంబాయి రమేష్, వెంకటరెడ్డిపల్లి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జెడ్పీ స్టాండింగ్ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు మంగళ, బుధవారాల్లో జరగనున్నాయి. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు సోమవారం ప్రకటన విడుదల చేశారు. తొలి రోజు స్థాయీ సంఘం–1, 3, 7(ఆర్థిక, ప్రణాళిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ విభాగాలు) సమావేశాలు జెడ్పీ సమావేశ భవన్‌తో పాటు అదనపు సమావేశ భవనాల్లో జరుగుతాయన్నారు. మలి రోజు స్థాయీ సంఘం–2, 4, 5, 6(గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్య/స్త్రీ–శిశు సంక్షేమం/సాంఘిక సంక్షేమ శాఖలు) నిర్వహించన్నారు. ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

భగ్గుమన్న ఎండలు



శింగనమల: జిల్లా వ్యాప్తంగా ఎండలు భగ్గుమంటున్నాయి. శింగనమల మండలం తరిమెలలో సోమవారం 42.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఎండవేడిమికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వారం రోజుల క్రితం వరకు వర్షం పడడంతో ఇక ఎండ వేడిమి తప్పిందని భావించిన ప్రజలకు తాజాగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు బెంబేలెత్తిస్తున్నాయి.

ప్రతి అర్జీ పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: 'స్పందన' ద్వారా అందే ప్రతి అర్జీని పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 283 అర్జీలు స్వీకరించారు. అనంతరం స్పందన అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్, జేసీ సమీక్షించారు. స్పందనలో అందే అర్జీకీ నిర్దేశించిన గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఆర్థికేతర సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు.

అర్జీల్లో కొన్ని...

- పాపంపేటలో సర్వే నంబరు 49, 50లో లేఅవుట్ నంబరు 106/77లో ప్లాట్ నంబర్ 182 నుంచి 199 వరకు ఉన్న 33 అడుగుల రోడ్డు ఆక్రమణలతో 12 అడుగులకు కుచించుకుపోయిందని గురుప్రసాద్, సూర్యనారాయణ, లక్ష్మీనరసింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.
- నగర పాలక సంస్థలో పారిశుధ్య కార్మికుల నియామకంలో సఫాయి కార్మికులకు అవకాశం కల్పించాలని చెబుతున్న జీఓ 30ని అమలు చేయడం లేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు చిన్నపెద్దన్న, తదితరులు విన్నవించారు.
- సర్వే నంబరు 320–1లో ప్రభుత్వం తనకు కేటాయించిన రెండు సెంట్ల స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని హమాలీ కాలనీకి చెందిన కమలమ్మ అర్జీ సమర్పించింది.




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి

సంక్షేమం అర్హుల దరిచేరాలి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హుల దరికి చేర్చాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు, కార్యక్రమాల నిర్వహణ, తదితర అంశాలపై సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 12 ఎకరాలకు పైగా చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం అభినందనీయమన్నారు. జాతీ రహదారులు, పరిశ్రమల ఏర్పాటు, 90 రోజుల్లో ఇళ్ల పట్టా పథకం కింద ఇంటి స్థలం వంటి కార్యక్రమాలకు భూసేకరణ వేగవంతం చేయాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఎంఐజీ లే అవుట్లకు సంబంధించి ప్రతిపాదనలు తక్షణం పంపించాలని చెప్పారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి భూములను ఏపీఐఐసీకి అప్పగించాలన్నారు. నీటి ప్రాజెక్టుల కోసం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలన్నారు. భూముల సమగ్ర రీ సర్వే త్వరితగతిన పూర్తి చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రీదేవి, సీపీఓ ప్రేమ్‌చంద్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డీఈఓ సాయిరాం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం అర్బన్: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో అనధికార సభ్యుల నియామకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార సభ్యులుగా దరఖాస్తు చేసుకోవాలనుకునే బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాల వారు సమాజ సేవలో పేరు ప్రఖ్యాతలు గడించిన వారై ఉండాలన్నారు. అదే విధంగా ఎస్జీఓలతో కలిసి పనిచేసిన ఉండాలన్నారు. దరఖాస్తును పెన్నార్ భవన్‌లోని షెడ్యూలు కులాల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో 31వ తేదీలోపు సమర్పించాలన్నారు.

మైనార్టీ గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు రూరల్: గార్లదిన్నెలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5, 6, 7 తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బీ.మల్లికార్జునుడు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. 5వ తరగతిలో 63 సీట్లు, 6వ తరగతిలో 2 సీట్లు, 7వ తరగతిలో 4 సీట్లు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా జూన్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పాఠశాలలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97018 89876 నంబరులో సంప్రదించాలని కోరారు.

విఠల.. విఠల.. పాండురంగ..



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురం ఉంతకల్లులో రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు పండరీపుర పీఠాధిపతి గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తజన సందోహం నడుమ రథోత్సవం ప్రారంభించారు. పాండురంగస్వామి ఆలయం నుంచి బసవన్న ఆలయం వరకు రథాన్ని లాగారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు విఠల... విఠల రుక్మిణీ పాండురంగ విఠల అంటూ రథం ముందు భాగాన ప్రత్యేక భజనలు చేశారు. అనంతరం పల్లకీ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ జీ.శివ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

క్లుప్తంగా

నేటి నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు



పంపిణీకి సిద్ధం చేసిన వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా మంగళవారం నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో 40 శాతం రాయితీ పోను తక్కిన మొత్తాన్ని చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 3 బస్తాలు (90 కిలోలు) నాణ్యమైన విత్తనాలు అందిస్తామన్నారు.

'అనంత'లో దారుణం

- ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాకంతో ఇద్దరు గర్భిణుల మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్న బంధువులు
- గర్భంలోనే మృతి చెందిన శిశువు
- ఫిట్స్‌తో నిండు గర్భిణి కన్నుమూత?
- మరో ఘటనలో లింగనిర్ధారణ పరీక్ష!
- అబార్షన్ చేసిన తర్వాత గర్భిణి మృతి



మృతురాలు సనం సుల్తానా



మృతిపై ఆరా తీస్తున్న వైద్య ఆరోగ్యశాఖ డెమో బృందం

అనంతపురం క్రైం/శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. వేర్వేరు ఘటనల్లో ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్వాకంతో ఇద్దరు గర్భిణులు మృతి చెందారు. ఇందులో కాన్పు కష్టమై ఒకటి మాతాశిశు మరణం చోటు చేసుకోగా... మరో ఘటనలో లింగనిర్ధారణతో పుట్టబోయేది ఆడపిల్లేనని నిర్ధారించి చేసిన అబార్షన్ వికటించడంతో గర్భిణి మృతి చెందింది. ఈ రెండు ఘటనల్లో వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ పోలీసులకు బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి.

తొలి కాన్పు అక్కడే..

అనంతపురంలోని ఆర్వేటినగర్‌కు చెందిన మహబూబ్‌బాషా, సనం సుల్తానా (28) దంపతులు. వీరికి మూడేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. తొలి కాన్పును సంగమేశ్వరనగర్‌లోని బాలాజీనర్సింగ్‌హోంలోనే కుటుంబసభ్యులు చేయించారు. తల్లీబిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉండడంతో ఆస్పత్రిపై కుటుంబసభ్యులకు నమ్మకం పెరిగింది. దీంతో రెండోసారి గర్భం దాల్చడంతో ఆమెను అక్కడే వైద్యురాలి పర్యవేక్షణలో చికిత్స చేయిస్తూ వచ్చారు. నెలలు నిండడంతో ఆదివారం ఉదయం నొప్పులు మొదలయ్యాయి. దీంతో నర్సింగ్‌హోమ్‌కు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గ్యాస్ట్రిక్ సమస్య ఉండవచ్చునని, భయపడాల్సిన పనిలేదని చెప్పి ఇంటికి పంపారు. సోమవారం ఉదయం మరోసారి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన సనం సుల్తానాను బాలాజీ నర్సింగ్ హోమ్‌కు చేర్చారు. వైద్యురాలు జ్యోత్స్న పరీక్షించి సాధారణ ప్రసవం చేస్తామంటూ నిండు గర్భిణిని లేబర్ రూంకు తరలించారు. కాసేపటికి స్కాన్ చేసి చూడగా బిడ్డ మృతి (ఇంట్రాయుట్రెన్ డెత్) చెందినట్లు ధ్రువీకరించారు.

క్షణాల వ్యవధిలోనే..

మృతశిశువును తొలగించే క్రమంలో సనం సుల్తానా అపస్మారక స్థితికి చేరుకుంది. వైద్యులు సపర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. వైద్యురాలు పరీక్షించి.. ఆమె మృతి చెందినట్లు నిర్ధారించగానే కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వైద్యుల నిర్లక్ష్యంతోనే తల్లీబిడ్డ మృతి చెందారని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుల బంధువులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. అనంతరం బాధితులకు సర్దిచెప్పి కేసు నమోదు చేయడంతో వివాదం సద్దుమణిగింది. అప్పటికే సమాచారం అందుకున్న వైద్య, ఆరోగ్య శాఖ డెమో బృందం హుటాహుటిన నర్సింగ్‌హోంకు చేరుకుని విచారణ చేపట్టింది. మాతాశిశు మరణానికి కారణాలపై ఆరా తీసింది. డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ.. గర్భంలోనే శిశువు మృతి చెందినప్పుడు ఉమ్మి నీరులో రక్తం చేరి (అమ్నియాటిక్ ఫ్లూయిడ్ ఎంబాలిసమ్) ఊపిరితిత్తుల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోతుందని, దీని వల్ల మెదడుకు సరిపడే ఆక్సిజన్ అందక ఫిట్స్ వచ్చి గర్భిణి మృతి చెంది ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తం చేశారు.

అబార్షన్ వికటించి గర్భిణి మృతి

గర్భస్థ పిండం లింగ నిర్ధారణ చేసి, పుట్టబోయేది ఆడపిల్లగా నిర్ధారించి, అబార్షన్ చేసే క్రమంలో గర్భిణి ప్రాణాలను బలిగొన్న ఓ ప్రైవేట్ వైద్యురాలి నిర్వాకం అనంతపురం నగరంలో కలకలం రేపింది. ఘటనపై అనంతపురం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన కవిత (25), హనుమంతు దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. మూడోసారి గర్భం దాల్చడంతో కవితకు పుట్టబోయేది కొడుకా? కూతురా? అనేది నిర్ధారించుకునేందుకు అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న రూత్ క్లినిక్‌కు దంపతులు వచ్చారు. ఈ క్రమంలో ఆమెను పరీక్షించిన వైద్యురాలు లక్ష్మీకాంతమ్మ.. లింగనిర్ధారణ పరీక్ష చేయించారు. పుట్టబోయేది ఆడపిల్లగా నిర్ధారించి అబార్షన్ చేయించుకోవాలంటూ సర్దిచెప్పారు. దీనికి దంపతులు అంగీకరించడంతో ఆదివారం అబార్షన్ చేసి, అదే రోజు సాయంత్రం ఇంటికి పంపారు. సోమవారం కవిత పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబసభ్యులు వెంటనే రూత్ క్లినిక్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అక్కడ లేకపోవడంతో సిబ్బంది సూచన మేరకు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కవిత మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ కేసు నమోదు చేసినట్లు అనంతపురం మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

రాయిపై పడి గొర్రెల కాపరి మృతి



హనుమన్న (ఫైల్)

గుంతకల్లు రూరల్: అదుపు తప్పి రాయిపై పడిన ఓ పాదచారి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలంక సాపురం గ్రామానికి చెందిన హనుమన్న (65), అలివేలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలు చిన్నవయసులో ఉన్నప్పుడే భార్య మృతి చెందింది. దీంతో కుమార్తెలను హనుమన్నే పెంచి పెద్దచేసి, స్థానికంగానే పెళ్లిళ్లు చేసిచ్చాడు. ఈ క్రమంలో తన పెద్ద కుమార్తె మద్దిలేటమ్మ వద్ద ఉంటున్న హనుమన్న గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం గొర్రెలను మేపునకు తోలుకెళుతూ.. మార్గమధ్యంలో అదుపుతప్పి రాయిపై పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడని భావించిన స్థానికులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

చిరుత దాడిలో ఆవుదూడల మృతి

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లిలో చిరుత దాడి చేయడంతో రైతు గంగయ్యకు చెందిన రెండు దూడలు మృతి చెందాయి. 15 రోజుల క్రితం రూ.లక్ష వెచ్చించి ఓ ఆవుతో పాటు రెండు దూడలను కొనుగోలు చేసి, గ్రామ శివారులోని తన తోటలో ఉన పశువుల పాకలో కట్టేసి ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున పశువుల పాకలోకి ప్రవేశించిన చిరుత... దూడలపై దాడి చేసి, సగానికి పైగా తినేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, పశువైద్యాధికారి అక్కడకు చేరుకుని దూడల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

డ్రిప్ పరికరాల దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కూడేరు: డ్రిప్ పరికరాలు అపహరించుకెళ్లే ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కూడేరు పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను సీఐ శేఖర్, ఎస్ఐ సత్యనారాయణ వెల్లడించారు. ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లికి చెందిన బోయ మలరాయుడు అంతరగంగ, ఇప్పేరు, పి.నాగిరెడ్డిపల్లి, అరవకూరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో తొలుత ద్విచక్ర వాహనంలో తిరిగి పొలాల్లో డ్రిప్ పైపులు, పరికరాలను గుర్తించేవాడు. అనంతరం రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా వాటిని ఆటోలో తరలించి గుజరీకి విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఇటీవల డ్రిప్ చోరీలపై ప్రత్యేక దృష్టిసారించిన పోలీసులు పక్కా ఆధారాలతో మలరాయుడిపై నిఘా వేశారు. సోమవారం ఆటోలో డ్రిప్ పైపులు తరలిస్తుండగా తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి, రూ.50 వేలు విలువ చేసే డ్రిప్ పైపులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.2 లక్షల అపహరణకు యత్నం

- వెంటాడి పట్టుకున్న యువకులు



నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టపగలే ఓ మహిళ నుంచి రూ.2 లక్షలు అపహించుకెళ్లేందుకు ప్రయత్నించిన యువకుడిని స్థానిక యువకులు వెంటాడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు... గుత్తి మండలం ఊటకల్లుకు చెందిన లక్ష్మీదేవికి గుత్తి ఆర్ఎస్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉంది. సోమవారం ఉదయం తన ఖాతా నుంచి రూ.2 లక్షలు ఆమె డ్రా చేసి, తన బ్యాగులో ఉంచుకుని బయటకు వచ్చింది. అప్పటి వరకూ ఆమె చర్యలను గమనిస్తున్న ఓ యువకుడు వెంటనే బ్యాగ్ లాక్కొని ఉడాయించాడు. విషయాన్ని గమనించిన అక్కడే ఉన్న యువకులు గద్దల నాగేంద్ర, రవికుమార్, ప్రసాద్, వినయ్ వెంటనే ఆ యువకుడిని వెంటాడారు. దాదాపు అర కిలోమీటరు దూరం సాగిన ఛేజింగ్‌లో చివరకు ఆగంతకుడిని పట్టుకుని, బాధితురాలికి రూ.2లక్షలు నగదు ఉన్న బ్యాగ్‌ను అప్పగించారు. అనంతరం ఆగంతకుడిని పోలీసులకు అప్పగించారు. విచారణలో ఆగంతకుడు ముంబాయికి చెందిన ప్రభుగా తేలింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సకాలంలో స్పందించి దొంగను పట్టించిన యువకుల సాహసాన్ని స్థానికులు అభినందించారు.

ప్రమాదంలో హౌసింగ్ డీఈకి గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న డీఈ నాగరాజు

పుట్టపర్తి అర్బన్: ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్న ఘటనలో కారు నడుపుతున్న హౌసింగ్ డీఈ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... బుక్కపట్నం మండలం మదిరేబైలు తంగాకు చెందిన నారాయణిబాయి ఇటీవల గృహ నిర్మాణానికి సంబంధించి తలెత్తిన సమస్యపై స్పందనలో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణకు సోమవారం హౌసింగ్ డీఈ నాగరాజు.. మదిరేబైలు తండాకు వెళ్లారు. సమస్య తెలుసుకుని పరిష్కారం చూపారు. అనంతరం సాయంత్రం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వీరాంజనేయపల్లి వద్దకు చేరుకోగానే కారు నడుపుతున్న నాగరాజు నియంత్రణ కోల్పోవడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టును కారు ఢీకొంది. ఘటనలో నాగరాజు తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆయన వెంట ఉన్న బుక్కపట్నం మండలం హౌసింగ్ ఏఈ యశ్వంత్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని క్షతగాత్రులను సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించింది. ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కదిరి అర్బన్: మండలంలోని మరువ తండా సమీపంలో ఉన్న విశరాయుని చెరువు వద్ద సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కదిరి రూరల్ పోలీసులు కోరారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ



రాష్ట్ర స్థాయి చెస్ విజేతలతో ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం: రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ సోమవారం ముగిసింది. ఆలిండియా చెస్ ఫర్ ఎవరివన్ ఫిడే రేటేడ్ చెస్ టోర్నమెంట్–2023 పేరుతో నిర్వహించిన ఈ పోటీల్లో వీర భగతీశ్వరరెడ్డి 9 పాయింట్లకు గాను 8.5 పాయింట్లు సాధించి చాంపియన్‌గా నిలిచాడు. రన్నరప్‌ను 8 పాయింట్లతో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అఫ్రిద్ టి.ఖాన్ దక్కించుకున్నాడు. తిరుపతి జిల్లాకు చెందిన లతీష్ రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. గుంటూరు జిల్లాకు చెందిన అమర్ సి.ఎస్.7 పాయింట్లతో నాల్గో స్థానంలో అనంతపురం జిల్లాకు చెందిన కటారి భవన కృతి ఐదో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందించి నగదు పురస్కారాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కేవీపీ శర్మ , సురేంద్రకుమారరెడ్డి, డాక్టర్ సుప్రజాచౌదరి, ఆదిరత్నకుమార్, అనంతపురం చెస్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ బాలరాజు, టోర్నీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ నాయుడు, చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, డిప్యూటీ చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపు దగ్ధం



దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు

తాడిమర్రి: స్థానిక ప్రధాన రహదారి పక్కనే దిమ్మగుడి అల్లాబకాష్ నిర్వహిస్తున్న కూల్‌డ్రింక్ దుకాణం మంటల్లో దగ్ధమైంది. 30 ఏళ్లుగా పీర్లచావిడి పక్కన కూల్‌డ్రింక్ దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని ఆయన పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం 6.30 గంటలకు దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని నిప్పు రవ్వలు ఎగిసి పడ్డాయి. చూస్తుండగానే మంటలు చెలరేగి దుకాణాన్ని చుట్టుముట్టడంతో రూ.1.50 లక్షల విలువైన కూల్ డ్రింక్‌లు, వాటర్‌బాటిళ్లు, రూ.70 వేలు విలువ చేసే రెండు రిఫ్రిజిరేటర్లు, రూ.3 లక్షలు విలువ చేసే కూలింగ్ మిషన్ కాలి బూడిదయ్యాయి. ఆ దుకాణానికి పక్కనే రాజస్తాన్‌కు చెందిన పూర్ణారావు నిర్వహిస్తున్న టీ స్టాల్‌లో రూ.15 వేలు విలువ చేసే ద్విచక్ర వాహనం, తోపుడు బండి కాలి పోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. సమాచారం అందుకున్న వీఆర్వో రాజకుళ్లాయప్ప అక్కడు చేరుకుని జరిగిన నష్టంపై వివరాలు సేకరించారు. కాగా, విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి.. ఫోన్‌లో బాధితుడిని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి: ఐరన్ ట్రాలీలు అపహరించుకెళ్లిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సోమవారం సోమందేపల్లి ఎస్ఐ విజయ్ కుమార్ వెల్లడించారు. మండలంలోని రంగేపల్లి గ్రామ సమీపంలో ఆ గ్రామ సర్పంచ్ నరసింహులు ఇటుకల పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. ఈ నెల 11న దుండగులు పరిశ్రమలోకి చొరబడి 72 ఐరన్ ట్రాలీలు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో రాంబాబు కాలనీకి చెందిన రాజు, మారుతి, షామీర్, హరీష్, వేణు ఉన్నారు. వీరి నుంచి రూ.2.52 లక్షల విలువైన ట్రాలీలు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలోని జిల్లా క్షయ నివారణ సంస్థ కార్యాలయంలో టీబీ సూపర్ వైజర్, టీబీ హెల్త్ విజిటర్ పోస్టులకు అర్హులైన వారి కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం పూర్తయింది. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ పరిశీలించారు. మౌఖిక పరీక్ష అనంతరం శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు సంబంధించి సూపర్ వైజర్ పోస్టును, హిందూపురంతో పాటు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి సంబంధించి హెల్త్ విజిటర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు.

అంగన్‌వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు రేపు

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 17న అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపుతున్నామని, ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

డీఎస్సీ అభ్యర్థులకు మరో అవకాశం

రాప్తాడు రూరల్: 98–డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇప్పటికే పలువురిని ఎంటీఎస్ కింద ఇటీవల ఎస్జీటీ పోస్టుల్లో నియమించింది. అయితే కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన అభ్యర్థులకు మరో అవకాశం కల్పించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 536 పోస్టులకు గాను 480 పోస్టులను భర్తీ చేశారు. తక్కిన 56 పోస్టులు భర్తీ చేసేందుకు మెరిట్ జాబితాలోని 44 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని డీఈఓ సాయిరామ్ పేర్కొన్నారు. ఈనెల 17న డీఈఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

బావిలో పడి చిన్నారి మృతి

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ చిన్నారి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కొండంపల్లికి చెందిన రమణారెడ్డి, నందిని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన నందిని... బావి వద్ద దుస్తులు శుభ్రం చేస్తుండగా... చిన్న కుమారుడు తన్విష్ (15 నెలలు) ఆడుకుంటూ అదుపుతప్పి బావిలో పడ్డాడు. తల్లి కేకలు వేయడంతో రైతులు అక్కడకు చేరుకుని బాలుడిని వెలికి తీశారు. అప్పటికే నీట మునిగి ఊపిరి ఆడక చిన్నారి మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి



లక్ష్మీదేవి (ఫైల్)

పుట్లూరు: మండలంలోని పి.చింతలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(62) వడదెబ్బకు గురై మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్న లక్ష్మీదేవి... సోమవారం మొక్కజొన్న గింజల్లో మట్టి పెళ్లలు ఏరి వేస్తుండగా.. ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన తోటి కూలీలు ఆమెను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. వడదెబ్బ ప్రభావమే ఇందుకు కారణంగా పేర్కొన్నారు. కాగా, లక్ష్మీదేవికి భర్త చెన్నారెడ్డి, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

జాతీయ క్రికెట్ కౌన్సిల్ కోర్ కమిటీలో జిల్లా వాసి



మధుసూదన్ నాయక్

అనంతపురం: డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీసీసీఐ) కోర్ కమిటీ లో జిల్లాకు చెందిన ఎస్.మధుసూదన్ నాయక్‌కు చోట దక్కింది. ఈ మేరకు డీసీసీఐ ప్రధాన కార్యదర్శి రవికాంత్ చౌహాన్ సోమవారం తెలిపారు. 11 మంది సభ్యులతో కూడిన కోర్ కమిటీ బీసీసీఐ అనుబంధంగా దివ్యాంగుల క్రికెట్ వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. కమిటీలో చోటు దక్కించుకున్న మధుసూదన్ నాయక్‌ను ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి అభినందించారు.

నేటి నుంచి పురుషుల క్రికెట్ ఫిట్‌నెస్ క్యాంప్

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకూ ఆంధ్రా పురుషుల క్రికెట్ జట్టు ఫిట్‌నెస్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) గౌరవ కార్యదర్శి కె.మధు ఆచారి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జట్టులో అనంతపురం క్రీడాకారులు పి. గిరినాథరెడ్డి, బి.సంతోష్, ఎంకే దత్తారెడ్డి, పి.అర్జున్‌టెండూల్కర్ ఉన్నారు. శిబిరానికి నిర్మల్ కుమార్ కోచ్‌గా, అనంతపురానికి చెందిన బొమ్మన్న ఎస్ అండ్‌సీగా వ్యవహరించనున్నారు. సహాయకులుగా గురు రాఘవేంద్ర, వినీల్‌కుమార్‌ను నియమించారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మలరాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు

ఆత్మకూరు: మండల పరిధిలోని మదిగుబ్బ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మలరాయుడు (48) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి మదిగుబ్బకు చేరుకొని మలరాయుడు మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు. రూ.20 వేలను ఆర్థిక సహాయంగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహా (దాదా), ఎంపీటీసీ లక్ష్మీదేవి, వీరాంజినేయులు, నరసింహారెడ్డి ఉన్నారు.

ఆత్మకూరు ఎస్‌ఐగా జనార్దన్



ఆత్మకూరు: మండల నూతన ఎస్‌ఐగా జనార్దన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పనిచేసిన ఎస్‌ఐ రంగడు బదిలీపై వెళ్లగా స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న జనార్దన్‌ను ఆత్మకూరు ఎస్‌ఐగా నియమించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయన స్వాగతం పలికారు. ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతల పర్యవేక్షణకు కృషి చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు నష్టపరిహారమివ్వండి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గత ఏడాది అకాల వర్షాలతో దెబ్బతిని నష్టాల పాలైన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం, ఏపీ రైతు సంఘం నాయకులు సోమవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘ నాయకులు, సీపీఎం నాయకులు రాము, రామయ్య, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అక్కమ్మ దేవతలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొద్ది రోజుల క్రితం దేవలతోటలో వెలసిన తిరుగడ అక్కమ్మ గార్ల పరుష కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం అక్కమ్మ దేవతలకు నెల పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయం వద్ద నుంచి అక్కమ్మ దేవతల గంపను ఎత్తారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నష్టపరిహారం ఇవ్వాలి

అనంతపురం అర్బన్: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఐ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ పంట నష్టపోయిన ఉద్యాన రైతులకు ఎకరాకు రూ.లక్ష, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.75 వేలు, ఆహార పంటలక ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. సబ్సిడీపై విత్తన వేరుశనగకాయలు ఎకరాకు ఐదు బస్తాలు ఇవ్వాలని కోరారు. అనంతరం 'స్పందన'లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

'స్పందన'లో వసతులు కల్పించాలి

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించే 'స్పందన'లో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో నిరసన తెలిపారు. నాయకులు చిన్నపెద్దన్న, తిరుపాలు, లోలూరు కుళ్లాయప్ప, పెన్నోబులేసు, ఓబులేసు మాట్లాడుతూ అర్జీదారులకు గతంలో ఇస్కాన్ సంస్థ ద్వారా మధ్యాహ్నం భోజన వసతి, వేసవిలో మజ్జిగ ఇచ్చేవారన్నారు. ఇప్పుడు కనీస తాగునీటి వసతి కూడా సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి

- పెట్టుబడి ఖర్చు ఆదా
- రసాయనాల వినియోగం హానికరం
- డీపీఎం లక్ష్మానాయక్
- ఘనజీవామృతం, ద్రవ జీవామృతంపై రైతులకు అవగాహన



ఆముదం పంటను పరిశీలిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

రాప్తాడు: ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధ్యమని ప్రకృతి వ్యవసాయ డీపీఎం లక్ష్మానాయక్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని గాండ్లపర్తి, జి.కొత్తపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంతో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చు ఆదా అవుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలకు కేవలం 10 శాతం నీరు సరిపోతుందని, తద్వారా 90 శాతం నీటిని కూడా ఆదా చేయవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కల్గిన అభివృద్ధి చెందిన దేశాలే పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలను, నాణ్యమైన దిగుబడులను సాధించాలంటే ప్రకృతి వ్యవసాయమే ఉత్తమమైనదని పేర్కొన్నారు. రసాయనాలతో పండించిన ఆహారాన్ని తింటూ మానవాళి కొత్త రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషరహితమైన ఆహారం తింటే ప్రజల దరికి రోగాలు రావన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నీరు, గాలి కలుషితం కాకుండా కాపాడవచ్చన్నారు. ఒక్క దేశవాళీ ఆవుతో 30 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండించవచ్చన్నారు. అనంతరం ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బీజా మృతం ఎలా తయారు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఏఓ ప్రవీణ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ భానుమతి, పీఆర్పీ దేవి, వీఏఏ నలినాక్షి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రాప్తాడురూరల్: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలు నాయకులు సోమవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశాయి. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాశాయిస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి అబ్దుల్ ఆలం మాట్లాడుతూ నిబంధనలను బేఖాతరు చేస్తూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను అమ్ముతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రమణయ్య, ఉమామహేష్, వంశీ, ఆనంద్ సమీర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ముస్తఫా, చంద్ర, రాజేష్, ఏఐఎస్‌బీ నాయకులు నాగార్జున, నరేష్, మారుతి ధనుష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య నాయకులు అభి, రాజవర్ధన్, ఏఐఎస్‌ఏ నాయకులు రవికుమార్, ప్రతిభ, భారతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థుల చేత పుస్త పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి, ఉపాధ్యాయులు

కనగానపల్లి: విద్యార్థులు బాల్య దశ నుంచే పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు చదవటంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగముని, రామాంజనేయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మరిన్ని వసతులు



నైవేద్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి (ఈఓ) రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిత్య నైవేద్య వినియోగ కేంద్రాన్ని వారు సోమవారంప్రారంభించారు. అనంతరం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈఓతో పాటు సభ్యులు చంద్ర, తిమ్మారెడ్డి, సురేషకుమార్ తదితరులు మాట్లాడారు. జిల్లాలోని ప్రధాన శైవక్షేత్రాలతో పాటూ పూజలందుకుంటున్న శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో రుద్రాభిషేకాలకు భక్తులు వస్తుంటారన్నారు. వీరికి తీర్థప్రసాదాలతో పాటు ఫలహారమందించాలని తీర్మానించారు. బయట నుంచి నైవేద్యాలను తెప్పించే పద్ధతికి స్వస్తి పలికి ఆలయంలోనే తయారు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జీజే వేణు, వైఎస్సార్‌సీపీ నాయకులు రిలాక్స్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డీకే శివకుమార్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

అనంతపురం: కర్ణాటక పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ జన్మదిన వేడుకలను ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సోమవారం ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద నిర్వహించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు డీకే శివకుమార్ విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ యనుమల ప్రసాద్, సాకే చందు, మారెన్న మారెన్న, అరుణ్‌కుమార్, రాజ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి పద్మప్రియ

రాప్తాడు: విద్యార్థులకు భౌతిక శాస్త్రం అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉప విద్యాశాఖాధికారి, కోర్స్ కోఆర్డినేటర్ పద్మప్రియ సూచించారు. సోమవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో 2018 డీఎస్సీ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఐదు రోజుల వృత్యంతర శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మప్రియ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2018 డీఎస్సీలో ఎన్నికైన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు నూతన సిలబస్, బోధన పద్ధతులు, నూతన పాఠ్య పుస్తకాలు, ఉపాధ్యాయ వృత్తిలో మెలకువలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, రిసోర్స్ పర్సన్స్ ఆనంద భాస్కర్‌రెడ్డి, వినీల్, శ్రీనివాస్, శివనాగేశ్వర్, కళ్యాణ్ కుమార్, సుబ్రమణ్యం, పరిశీలకులు పాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా బోధన

రాప్తాడురూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు బోధన ఉండాలని చైతన్య విద్యా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతపురం శ్రీనివాస్‌నగర్‌లోని బాలాజీ కళ్యాణ మంటపంలో సోమవారం చైతన్య విద్యా సంస్థల ఉపాధ్యాయులకు వార్షిక శిక్షణ సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అనంతపురం జోన్ ఏజీఎం సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడతూ చైతన్య విద్యా సంస్థలు ఆసియాలోనే అతిపెద్ద విద్యా సంస్థలన్నారు. టీచర్లకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకొని వారికి అనుగుణంగా ఎలా బోధించాలనే అంశాలపై శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. ఆలిండియా అకడమిక్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకుని తమ మేధస్సుకు పదును పెట్టాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో స్టేట్ అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లాల కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్లు నాగేశ్వరావు, గోవిందు, స్టేట్ సీ-బ్యాచ్ కోఆర్డినేటర్లు నరేంద్ర, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలి



ఏఓ పద్మావతిని ప్రశ్నిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అభివృద్ధి పనుల బిల్లులను కాంట్రాక్టర్లకు సకాలంలో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతిని మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థలోని అకౌంట్స్ సిబ్బందితో మేయర్ సమావేశమయ్యారు. బిల్లుల జాప్యానికి గల కారణాలపై ఏఓను ప్రశ్నించారు. బిల్లులు త్వరగా చెల్లిస్తే అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అకౌంట్స్ సిబ్బంది సుగుణ, కుళ్లాయప్ప, రజాక్, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన హౌసింగ్ అధికారులతో కలిసి కనగానపల్లిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో నిర్మాణాలు చేస్తున్నామన్నారు. మండలంలోని కనగానపల్లి, వేపకుంట, తూంచర్ల, బద్దలాపురం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సామగ్రితో పాటు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయిస్తున్నామన్నారు. ఇందుకు హౌసింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు తమవంతు సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ అంకె అశోక్, బీసీ ముత్యాలు, రవి, గోపాల్, ఓబిలేసు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు



అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ జిల్లా సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై అనంతపురానికి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్టీసీ ఆర్‌ఎం (జిల్లా ప్రజా రవాణా అధికారి) సుమంత్ ఆర్ ఆదోనిని మర్యాద పూర్వకంగా కలిశారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాసులు తెలిపారు.

బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బీజేపీ ఎంపీ, ఆల్ ఇండియా రెజ్లర్ల సంఘం అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎన్జీఓ హోమ్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తమ పార్టీ ఎంపీపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌బాబు, చంద్రప్ప, వీరేంద్ర, శంకర్, తిప్పయ్య, రామాంజినేయులు, దావీద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో హెచ్‌డీఎస్

అనంతపురం క్రైం: జేఎన్‌టీయూ సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ గౌతమి అధ్యక్షతన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశం జరగనుంది. సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాలతోపాటు ఏసీలు, కంప్యూటర్ల నిర్వహణపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ అజెండాను సిద్ధం చేశారు. కలెక్టర్ గౌతమి బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా జరుగుతున్న హెచ్‌డీఎస్ సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

రైతులకు పరిహారం చెల్లించాలి

రాప్తాడు: అధిక వర్షాలు, భారీ గాలులు, వడగండ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి పోతులయ్య డిమాండ్ చేశారు. సోమవారం పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులుకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం నాయకులు నారాయణ స్వామి, లక్ష్మన్న, సుబ్బిరెడ్డి, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారు అందించే ఎన్టీఆర్ కళారత్న, సేవారత్న జాతీయ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. వివిధ రంగాలలో విశేష కృషి చేస్తున్నవారికి ఈ నెల 28న హైదరాబాదులో అవార్డులనందిస్తామన్నారు. దరఖాస్తులను ఈనెల 20లోపు 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్ నం. 1-20-104, గోకుల్‌నగర్,వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాదు -15' చిరునామాకు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పరిటాల సునీత యాత్రకు స్పందన కరువు



సంఘీభావ యాత్రలో ప్రచార రథం

రాప్తాడురూరల్: టీడీపీ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులకు చేరుకున్న సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత సోమవారం అనంతపురం మండలంలో సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ప్రజల నుంచి సంఘీభావ పాదయాత్రకు స్పందన కరువవడంతో టీడీపీ నాయకులు రాజకీయ ఎత్తుగడ వేశారు. ప్రచార రథాన్ని సీజ్ చేశారంటూ అనంతపురం రూరల్ పోలీసులపై సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని దుష్ప్రచారానికి తెరలేపారు. వివరాల్లోకెళ్తే... పరిటాల సునీత సజ్జలకాలవ నుంచి పాపంపేట వరకు సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. మైకులతో కూడిన ప్రచార రథాన్ని ముందు పెట్టుకుని సాగారు. అయితే అనుమతులు లేకుండా పెద్దపెద్ద డీజేలు ఏర్పాటు చేసిన మరో వాహనాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇదికూడా పోలీసుల కంటపడకుండా సమీపంలోని ఓ తోటలో ఉంచారు. పాదయాత్ర ప్రారంభమయ్యే సమయానికి డీజేలు కట్టుకున్న ఐచర్ వాహనాన్ని అక్కడికి తెచ్చుకునేలా ప్రణాళిక వేసుకున్నారు. పోలీసుల దృష్టికి రావడంతో సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్‌ఐ నబీరసూల్ డీజేలు కట్టిన వాహనాన్ని అడ్డుకున్నారు. అనుమతులు ఉన్నాయా? అని డ్రైవర్‌ను అడిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇలా డీజేలు కట్టుకుని తిప్పితే వాహనాన్ని సీజ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో ఆ వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. మైకులు కట్టుకున్న ప్రచార రథంతో పాదయాత్రగా యథాతథంగా సాగింది. అయితే ప్రచార రథాన్ని పోలీసులు సీజ్ చేశారని, టీడీపీ నాయకులను బండబూతులు తిట్టారంటూ రెచ్చగొట్టేలా కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ప్రచారం కోసమే పోలీసులపై ఇలా దుష్ప్రచారం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: బలిజ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు వెంకటేశులు తెలిపారు. సోమవారం నగరంలోని బాలాజీ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 550 పైన మార్కులు సాధించిన వారు ప్రతిభా పురస్కారాల కోసం రాయలసీమ బలిజ మహాసంఘం కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ నాలుగో తేదీన ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99893 75456 (వెంకటేశులు), 92477 92567 (విజయ భాస్కర్), 94901 80177 (సాయిప్రసాద్), 94404 40969 (నాగేంద్రప్రసాద్)ను సంప్రదించాలన్నారు.

శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో పాల్గొనండి



మహాయజ్ఞంలో పాల్గొన్న జిల్లా గవిమఠం ఉత్తరాధికారి

అనంతపురం కల్చరల్: ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో జిల్లా వాసులు పాల్గొని తరించాలని దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు కోరారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న శతకుండాత్మక, చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీమహాలక్ష్మీ యజ్ఞాన్ని, పలు దేవతామూర్తుల కల్యాణోత్సవాలను తిలకించాలని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి సూచించారన్నారు. ఇక రెండు రోజులు మాత్రమే సమయం ఉందన్నారు.